సాక్షి మంచిర్యాల

సోమవారం, 4, నవంబర్, 2024



యూఏఈ.. మరో అవకాశం

వీసా గడువు ముగిసి అక్కడ పనిచేస్తున్న అక్రమ వలసదారుల యూఏఈ వీసాల క్రమబద్ధీకరణకు రెండు నెలల గడువు పొడిగించింది. డిసెంబర్ చివరి నాటికి క్షమాభిక్ష వర్తిస్తుంది. 8లో▸



గుండెలదురుతున్నాయ్..

హృద్రోగ, కాలేయ సమస్యలు పెరిగిపోతున్నాయి. 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువగా మృతి చెందడం ఆందోళన కలిగిస్తుంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /21.1

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వేకువ జామున చలిగా ఉంటుంది.

సర్వేకు సిద్ధం



రాపల్లిలో ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

- ఇళ్ల స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి
- జిల్లాలో 2.80 లక్షల గృహాలు
- గణనకు సమాయత్తం అవుతున్న అధికారులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉన్న 16 మండలాలు, 7 మున్సిపాలిటీల్లో 2.80 లక్షల ఇళ్లకు ఎన్యుమరేటర్లు వెళ్లి కుటుంబ యజమాని పేరు, ఇంటి నంబర్, ఇతర వివరాలు రాసి ఆ ఇంటికి స్టిక్కర్ అంటించే మొదటి దశ ప్రక్రియను ఆదివారంతో పూర్తి చేశారు. రెండోదశలో ఎన్యుమరేటర్లు ఆయా ఇళ్లకు వెళ్లి 56 అంశాలకు సంబంధించిన ప్రశ్నలను వేసి, సమాచారాన్ని సేకరించనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 1,806 మంది ఎన్యుమరేటర్లను నియమించి, ఇప్పటికే శిక్షణను పూర్తి చేశారు. వారు సేకరిస్తున్న వివరాలను పరిశీలించేందుకు 180 మంది సూపర్‌వైజర్లను జిల్లావ్యాప్తంగా నియమించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇళ్లను కేటాయించారు. ప్రతీ 10 ఎన్యుమరేషన్ బ్లాక్‌లకు డేటా సేకరణ పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించగా, ఎన్యుమరేటర్ సేకరించిన వివరాల్లో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంపిక చేసుకుని ఆ ఇళ్లను సందర్శించి పునఃపరిశీలన చేయనున్నారు. వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలను పాటించేలా చూస్తారు. వీటన్నింటిని పరిశీలించేందుకు నోడల్ అధికారులను సైతం నియమించారు.

56 వివరాల సేకరణ

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా గుర్తించిన 2.80 లక్షల ఇళ్ల యజమానుల వివరాలతో కూడిన స్టిక్కర్‌ను ఇళ్లకు అంటించారు. కలెక్టర్ సూచించిన తేదీ నుంచి 10 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి సర్వేలో ఇంటి యజమాని నుంచి ప్రభుత్వం పేర్కొన్న ఫార్మాట్‌లో 56 అంశాలకు సంబంధించిన 75 ప్రశ్నలతో కూడిన వివరాలను సేకరించనున్నారు. ప్రతీ ఎన్యుమరేటర్ వారికి కేటాయించిన ఇంటికి వెళ్లి ప్రభుత్వం రూపొందించిన పార్టు 1 ఫార్మాట్‌లో ఆ ఇంటి కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, వయసు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, ఉద్యోగం, కులం, వృత్తి, ఉపాధి, వ్యాపార వివరాలతో వార్షిక టర్నోవర్, రోజువారీ వేతనాలు, కుల వృత్తులైతే ఆయా వివరాలు, కార్మికులైతే ఏ రంగంలో పనిచేస్తున్నారనే వివరాలను సేకరించనున్నారు. వార్షిక ఆదాయం, ఆస్తులు, బ్యాంకుల్లో తీసుకున్న రుణం, ఆదాయపు పన్ను చెల్లింపుదారులా, బ్యాంకు ఖాతాలు ఉన్నాయాని తెలుసుకోవడంతోపాటు, పంట భూమి, ధరణి పాస్‌బుక్ నంబర్, కుటుంబానికి ఉన్న భూముల వివరాలను సేకరించి, అది ఏ రకమైన భూమి, నీటి పారుదల ఉందా లేదానే వివరాలను సేకరించనున్నారు. కౌలు ద్వారా పంటలను సాగు చేస్తే వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు. వీటితోపాటు, రిజర్వేషన్ విధానం నుంచి పొందిన విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, లబ్ధిపొందిన పథకాలు, ఓసీలు కాకుండా మిగతా వారు కుల ధృవీకరణ పత్రం పొందారో లేదో చెప్పాల్సి ఉంటుంది. పార్టు–2లో ఆయా కుటుంబానికి ఉన్న అప్పులు, వాటిని ఏ అవసరం కోసం తీసుకున్నారు, ఎక్కడి నుంచి ఆ అప్పును పొందారు వంటి వివరాలు, పశు సంపద వివరాలను నమోదు చేసేందుకు ప్రతీ కుటుంబం నుంచి సమాచారం సేకరించేందుకు అరగంట వరకు సమయం పట్టనుంది. సర్వే పూర్తి చేసిన తరువాత అప్పటికే ఇంటికి అంటించిన స్టిక్కర్‌పై సర్వే పూర్తిచేసినట్లుగా రాయాల్సి ఉంటుంది.

జిల్లాలో చేపట్టే సమగ్ర కుటుంబ సర్వే వివరాలు

జిల్లాలోని మండలాలు	16
మున్సిపాలిటీలు	7
ఎన్యుమరేటర్లు	1,806
సూపర్‌వైజర్లు	180

స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి

జిల్లావ్యాప్తంగా ఎన్యుమరేటర్లతో 2.80 లక్షల ఇళ్లకు స్టిక్కర్ వేసే ప్రక్రియ పూర్తయింది. కలెక్టర్ ఆదేశాలతో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టేందుకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. మొదటి దశలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్‌వేసే ప్రక్రియ పూర్తయ్యింది. రెండో దశలో 56 అంశాలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సేకరించనుండగా, సూపర్‌వైజర్లు ర్యాండమ్‌గా వాటిని పరిశీలిస్తారు. ఏ ఒక్క ఇంటిని సర్వేలో తప్పిపోకుండా చూడడం, తప్పులకు అవకాశం ఇవ్వకుండా చూస్తాం.

– ఎండీ.ఖాసిమ్, సీపీవో, జిల్లా నోడల్ ఆఫీసర్

ట్రాఫిక్ ఠాణాకు మోక్షమెప్పుడో..!



తాత్కాలికంగా హోంగార్డ్ భవనంలో కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

- హోంగార్డ్ భవనంలో కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
- ఇరుకు గదులతో ఇబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులను కష్టాలు వీడడంలేదు. ట్రాఫిక్ ఠాణా సొంత భవనానికి మోక్షం కలగడం లేదు. పోలీస్ సేవలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీస్ శాఖకు పెద్దపీట వేసిన గత ప్రభుత్వం పోలీస్ స్టేషన్ల నిర్వాహణ ఖర్చుల నిమిత్తం ఒక్కో పోలీస్ స్టేషన్‌కు గ్రేడ్ల వారీగా రూ.75 వేల నుంచి రూ. 25 వేల నిధులు మంజూరు చేసింది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రూ.25 వేలు నెలనెలా అందిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఖరీదైన వాహనాలు కూడా అందించింది. వాహనాలకు కావాల్సిన ఇంధనంతోపాటు, పోలీస్ శాఖ ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ పోలీస్ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసింది. ఇప్పటికే పలు జిల్లా కేంద్రాల్లో పోలీస్ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీస్ పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం స్థలం కేటాయింపులో భాగంగా స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనాన్ని తొలగించి అదే స్థానంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు అప్పటి పోలీస్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థకు చెందిన అధికారులు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తొలగించి పెట్రోల్ బంకు నిర్మాణం పనులు చేపట్టారు. ప్రస్తుతం పెట్రోల్ బంకు ఏర్పాటు చేసి రెండేళ్లయింది.

హోం గార్డ్ భవనంలో ట్రాఫిక్ ఠాణా...

పాత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూల్చివేయడంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు అద్దె భవనాల కోసం వెతికారు. సరైన భవనం దొరకకపోవడంతో పోలీస్ స్టేషన్ ఆవరణలోనే దశాబ్దాల క్రితం హోం గార్డ్స్ కోసం నిర్మించిన చిన్న గదిని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. మూడేళ్లుగా ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. పెట్రోల్ బంక్‌తోపాటు నూతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపడతామని అప్పటి అధికారులు తెలిపారు. కానీ పెట్రోల్ బంక్ నిర్మాణం మాత్రమే జరిగింది. పోలీస్ స్టేషన్ నిర్మించలేదు. దీంతో ఇరుకు గదుల్లోనే ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో కుస్తీ పడుతున్న పోలీసులు విశ్రాంతి తీసుకునేందుకు ఠాణాకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

మూడు సంవత్సరాల క్రితమే మంజూరు..

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం నిర్మించాలని మూడేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. అయితే స్థలం గుర్తించడంలో అధికారులు అలసత్వం వహించారు. తాజాగా ఏసీపీ కార్యాలయం వెనుక ట్రాఫిక్ ఠాణా నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమ సమస్యలు పరిష్కరించాలని నాలుగో తరగతి ఉద్యోగులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలేజ్ రోడ్‌లో యూనియన్ స్థలం గురించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఉద్యోగుల సమస్యలతోపాటు యూనియన్ స్థలం విషయంలో న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్, కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యచరణపై తీర్మానాలు చేశారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు

న్యూస్‌రీల్

గూడెంలో భక్తుల సందడి



సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు

దండేపల్లి: కార్తీక మాసం పురస్కరించుకుని రెండో అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు, వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. 280 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాల్లో పాల్గొన్నాయి.

బాధ్యతలు స్వీకరించిన జీఎం



జీఎంకు పుష్పగుచ్చం ఇస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా నూతన జీఎంగా ఎల్వీ.సూర్యనారా యణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీఎంగా పని చేసిన బి.సంజీవరెడ్డి అక్టోబర్ 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఆర్జీ 2 ఏరియా జీఎంగా పని చేస్తున్న సూర్యనారాయణను యాజమాన్యం శ్రీరాంపూర్‌కు బదిలీ చేసింది. జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులు నూతన జీఎంకు స్వాగతం పలికారు. ఎస్ఓటూజీఎం యస్.సత్యనారాయణ, ఓసీపీ పీఓలు ఏవీ.రెడ్డి, టీ.శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆయకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. డీజీఎం చిరంజీవి, ఏజెంట్లు రాముడు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, డీవైసీఎంవో రమేశ్‌బాబు, అన్ని గనుల మేనేజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, జీఎంగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు.

మంచిర్యాల నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

మంచిర్యాలఅర్బన్: కార్తీక మాసం సందర్భంగా అరుణాచలేశ్వరుని సందర్శన కోసం టీజీఎస్ఆర్‌టీసీ మంచిర్యాల డిపో నుంచి ప్రత్యేక బస్సును నడిపిస్తుందని డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 13న మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి కాణిపాకం, వెల్లూరు దర్శించుకుని కార్తీక పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో జోగులాంబ తల్లిని దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అరుణాచలం యాత్ర టికెట్ ధరలు పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.3,500గా నిర్ణయించామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5న ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

బెల్లంపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం(ఈనెల 5న) ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రెటరీ బి.బాబురావు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. 19 ఏళ్లలోపు యువకులు, విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తప్పక తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో కోచ్ రవి, వనిత, రాకేష్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 99857 88989 ,82470 96710 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన

మంచిర్యాలఅర్బన్: స్థానిక గోదావరినది తీరంలోని గౌతమేశ్వర ఆలయం ప్రాంగణంలో నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నవగ్రహ విగ్రహ ప్రతిష్టాచార్యులు సీతారాంశర్మ, గడియారం బాలాజీ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజతో ప్రారంభమైన కార్యక్రమంలో నవగ్రహ విగ్రహాలను పూల మంత్ర, జలాధివాసం, హోమ మంటప ప్రవేశ కార్యక్రమం చేపట్టారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా పూర్ణాహుతి చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీదేవి, శ్రీనివాస్, వంశీకృష్ణ, రాజేంద్రప్రసాద్, రాజేశ్, శ్రీనివాస్, హరీష్, సత్యనారాయణ, వైకుంఠం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు మల్కేపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆసిఫాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన అండర్–19 నెట్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కృష్ణ, ఖోఖోలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ప్రశాంత్, బాలికల అండర్–19 ఖోఖోలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని శిరీష ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీ శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవంలో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న సహస్రగౌడ్

జన్నారం: రాష్ట్రస్థాయి కళా ఉత్సవంలో జన్నారం మండల కేంద్రం స్టేట్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సహస్రగౌడ్ ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో నవంబర్ 1న సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ లో కళా ఉత్సవం నిర్వహించారు. సహస్రగౌడ్ మూడో స్థానంలో నిలిచింది. ఆదివారం విద్యార్థిని సహస్రగౌడ్‌తోపాటుగా, డ్యాన్స్ మాస్టర్ నర్మద గౌడ్‌ను పాఠశాల చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ షరీన్ ఖాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పల్లెలకు పక్కా రోడ్లు

- బీటీ రోడ్లుగా మారనున్న కంకర, మట్టిరోడ్లు
- లో లెవెల్, హై లెవెల్ వంతెనలతో రవాణా సులభం
- జిల్లాకు రూ.45 కోట్లు మంజూరు



కన్నెపల్లి మండలంలో రూ.1.20 కోట్లతో బీటీ రోడ్డుగా మారనున్న ఎల్లారం రోడ్డు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామీణ రోడ్లకు మహర్దశ కలగనుంది. గ్రామాల్లోని కంకర, మట్టి రోడ్లు ఇక బీటీ రోడ్లుగా మారనున్నాయి. అంతేకాదు లోలెవెల్, హైలెవెల్ వంతెనల నిర్మాణాలతో గ్రామ పంచాయతీ, మండల కేంద్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఈమేరకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 20 రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు, 7 బ్రిడ్జిలు నిర్మించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.45 కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించనున్నారు. మంజూరైన ఆయా గ్రామాల పరిధిలోని హ్యాబిటేషన్ గ్రామాలను అనుసంధానం చేసేలా బీటీ రోడ్లతోపాటు బ్రిడ్జీల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పనులు త్వరితగతిన ప్రారంభించేలా అంచనాల తయారీ, టెండర్ల ప్రక్రియ వేగవంతం చేసింది. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణ పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు సైతం చేశారు. గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలు, బ్రిడ్జిల నిర్మాణాలకు అనుమతులు రావడంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి అడుగులు..

జిల్లాలోని గ్రామాలకు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లాల్సి ఉంది. గతంలో పలుమార్లు ఈ రోడ్లకు గత ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేసినా అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో రోడ్ల నిర్మాణం జరగలేదు. రిజర్వు ఫారెస్ట్ ఆధీనంలోని రోడ్డు మార్గాలు లేకపోవడం, రవాణా సౌకర్యాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. అటవీ ప్రాంతాల మీదుగా ఉన్న రోడ్లు బీటీ రోడ్లుగా మారిస్తే గ్రామాల అభివృద్ధికి అడుగులు పడతాయని పలువురు పేర్కొంటున్నారు.

నియోజకవర్గాల వారీగా నిధులు ఇలా..

జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 7.50 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్న 6 బీటీ రోడ్లు 7 బ్రిడ్జిల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. చెన్నూర్ నియోజకవర్గంలో దాదాపు 5 బీటీ రోడ్లు 12.50 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఇక బెల్లంపల్లి నియోజకవర్గంలో 9 రోడ్లు దాదాపు 15 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. వీటికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి.

పనులు ప్రారంభం..



గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో బీటీ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు కూడా చేశారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చూస్తున్నాం.

– స్వామిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ

మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి


శ్రీరాంపూర్: సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. ఇప్పటికే మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీటిని చర్చల ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. యాజమాన్యం దిగిరాకుంటే ఆందోళనలు చేసైనా సాధిస్తామని తెలిపారు. ఐఈడీ నామ్స్ ప్రకారం కంపెనీ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అండర్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కంపెనీ వ్యాప్తంగా 100 ఖాళీల ఉంటే కేవలం 20 ఖాళీలు భర్తీ చేయడానికి యాజమాన్యం ముందుకు రావడం సరికాదన్నారు. ఓవర్‌మెన్, మైనింగ్ సర్దార్, షాట్‌ఫైరర్‌లకు చార్జి అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2016లో జేఎంఈటీలకు ఓవర్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఏదైనా కారణంతో మైనింగ్ స్టాఫ్ మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి ఎలాంటి షరతులు లేకుండా సూటబుల్ జాబ్ ఇవ్వాలని పేర్కొన్నారు. జేఎంవో పోస్టులకు ఏ 1 గ్రేడ్‌లో 6 ఏళ్ల కాలపరిమితిని శాశ్వతంగా తీసేసి ఏ గ్రేడ్‌లో ఉన్న ఓవర్‌మెన్లందరికీ జేఎంవో పోస్టులకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణలో కీలక పాత్ర పోషించే మైనింగ్ స్టాఫ్ సమస్యలను యాజమాన్యం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సబ్ కమిటీ రీజియన్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆశిష్, నాయకులు అద్దు శ్రీనివాస్, వెంకటేశ్, చంద్రశేఖర్, రాజేందర్, స్వరూర్, అనుదీప్, కుమారస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

హౌస్ లిస్టింగ్ పనులు పూర్తి చేయాలి

బెల్లంపల్లి: బీసీ కుల గణన ప్రక్రియలో భాగంగా ముందస్తుగా చేపట్టిన హౌస్ లిస్టింగ్ (ఇళ్ల సంఖ్య) గుర్తింపు పనులు సోమవారం నాటికి పూర్తి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సిబ్బందితో ఆదివారం సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. బీసీ కుల గణన సర్వేకు ముందస్తుగా ఇళ్ల సంఖ్యను గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతీ ఇంటిని కచ్చితంగా లెక్కించాలన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి కుల గణన సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. సర్వేకు మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని అన్నారు. సర్వే సమగ్రంగా నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరిపూర్ణంగా నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఇంటి నంబర్లు ఉన్న గృహాలను, ఇంటి నంబర్లు లేని గృహాలను వేర్వేరుగా గుర్తించాలని సూచించారు. ఈవిషయంలో మున్సిపల్ కౌన్సిలర్లు సిబ్బందికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా వీటిలో 130 మంది ఎన్యుమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లను నియమించి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ వచ్చే సర్వే సిబ్బందికి వారు అడిగే సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

స్పోర్ట్స్‌హబ్‌గా మంచిర్యాల

మంచిర్యాలటౌన్: మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనతో కలిసి సాయికుంటలోని 14 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఎకరాల స్థలంలో రెండెకరాలు నర్సింగ్ కాలేజీ కోసం, మిగతా 12 ఎకరాలు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తామన్నారు. అందులో ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువచ్చి క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, యువత చెడు మార్గంవైపు వెళ్లకుండా క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. మంచిర్యాలను క్రీడల హబ్‌గా మార్చేందుకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

క్లుప్తంగా

ఆగని మొరం తవ్వకాలు



రెబ్బనపల్లి సమీపంలో మొరం తవ్వకాలు

దండేపల్లి: మండలంలో అక్రమ మొరం తవ్వకాలు ఆగడం లేదు. సంబంధిత అధికారులు వాటిని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని గూడెం, రెబ్బనపల్లి సమీపాల్లో గల ప్రభుత్వ భూముల్లోని గుట్టల్లో దర్జాగా జేసీబీలతో మొరం తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మొరం తవ్వకాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

తాండూర్: మండలంలోని మాదారంలో రేషన్ బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రేషన్‌బియ్యం కొనడానికి వచ్చిన గజ్జెల నారాయణ వద్ద నుంచి 50 కిలోల బియ్యాన్ని పట్టుకున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆటోను సీజ్ చేసి మాదారం పోలీసులకు అప్పగించామన్నారు. గ్రామంలో 10 మంది మహిళలు రేషన్ బియ్యం కొనడానికి రాగా, రెవెన్యూ అధికారులు వస్తున్నారనే సమాచారంతో పారిపోయారు. అధికారుల నిఘాతో రేషన్ బియ్యం కొనుగోళ్లు ఆగిపోయాయి.

దాడికి దిగిన పది మందికి నోటీసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీచౌక్‌లో పరస్పరంగా దాడులకు దిగిన పది మందికి నోటీసులు జారీ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 1న దీపావళి పండుగ రోజున టపాసులు కాల్చుతున్న సమయంలో మ్యాక్స్ పికప్ నడుపుతున్న డ్రైవర్ జలీల్ ఖాన్ వాటిపై నుంచి వాహనాన్ని తీసుకెళ్లగా, రాకెట్లు తగిలి పలు దుకాణాల్లోకి చొరబడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. కోపోద్రిక్తులైన ప్రీతం శర్మ, షెట్టి శర్మ, కృష్ణశర్మ, చందన్‌శర్మ, యతేంద్రనాథ్, హితేంద్రనాథ్, శివ వాహన డ్రైవర్‌పై దాడికి దిగారు. దీంతో డ్రైవర్ మరో ఇద్దరు సయ్యద్ అజర్, మహ్మద్ కాషిఫ్‌తో వచ్చి వారితో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఆదివారం వారికి నోటీసులు జారీ చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

దగ్ధమైన పత్తి



కాలిపోయిన పత్తిని చూపిస్తున్న రైతు

తాంసి: భీంపూర్ మండలం అంతర్గాం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పత్తి దగ్ధమైంది. రైతు రాకేశ్ ఇంటివద్ద పది క్వింటాళ్లకు పైగా పత్తి పంట నిల్వచేశాడు. పత్తి తీతకు మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీల పిల్లలు టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వ పత్తిపై పడి అంటుకుంది. గ్రామస్తులు నీళ్లతో మంటలార్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే పత్తి, గది అగ్నికి ఆహుతయ్యేదని పలువురు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కొంతమేర పత్తి కాలిపోయింది.

యూఏఈ.. మరో అవకాశం

- వీసా క్రమబద్ధీకరణకు రెండు నెలల గడువు
- క్షమాభిక్ష ద్వారా అపరాధరుసుం లేకుండానే స్వస్థలాలకు..
- ఉమ్మడి జిల్లా వలస కార్మికులకు ప్రయోజనం



గల్ఫ్ దేశాల్లో పనిచేసున్న వలస కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వలస కార్మికులకు యూఏఈ మరో అవకాశం కల్పించింది. వీసా గడువు ముగిసి అక్కడ పనిచేస్తున్న అక్రమ వలసదారుల వీసాల క్రమబద్ధీకరణకు రెండు నెలల గడువు పొడిగించింది. గత అక్టోబర్‌కు వీసాల క్రమబద్ధీకరణ గడువు ముగిసినప్పటికీ చివరి వారంలో వేలాది దరఖాస్తులు వచ్చాయి. మరో రెండు నెలలు గడువును అక్కడి ప్రభుత్వం పొడిగించింది. డిసెంబర్ చివరి నాటికి అపరాధ రుసుము లేకుండా స్వదేశానికి తిరిగివచ్చేవారికి క్షమాభిక్ష (ఆమ్నెస్టీ) పథకం వర్తిస్తుందని గల్ఫ్ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

రెన్యువల్ చేసుకోకుండా..

విజిట్ వీసాపై వెళ్లిన కొందరు, కంపెనీ వీసాపై వెళ్లి గడువు ముగిసిన మరికొందరు రెన్యువల్ చేసుకోకుండా అక్రమంగా ఉంటున్నారని అక్కడి ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ, సిటిజెన్షిప్ సంస్థల గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూఏఈ 53వ యూనియన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్షమాభిక్ష పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెబుతున్నాయి. తుది గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే జనవరి 1 నుంచి తనిఖీలు తీవ్రతరం చేయనున్నట్లు చెబుతున్నాయి. వీసా గడువు క్రమబద్ధీకరణ లేదా తిరిగి స్వస్థలాలకు వెళ్లేవారు సంబంధిత కార్యాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల సూచించారు.

70 వేలకు పైగా కార్మికులు..

దుబాయ్, అబుదాబి, అజ్మాన్ షార్జా తదితర ఏడు దేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన దాదాపు 70 వేలకు పైగా వలస కార్మికులు ఉపాధి పొందుతున్నారని గల్ఫ్ కార్మిక సంఘాల అంచనా వేశాయి. వివిధ కారణాల రీత్యా వీసా గడువు ముగిసి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఉన్నారు. దాదాపు 15 వేల మందికి పైగా వీసా నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నారని చెబుతున్నాయి.

మా బాబును బతికించండి

- ఏడు నెలల చిన్నారికి నిమోనియా
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇషాన్
- వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు
- ఆపన్నహస్తం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు



చికిత్స పొందుతున్న ఇషాన్

జన్నారం: ఆడుతూ పాడుతూ ఉండాల్సిన చిన్నారి ఆస్పత్రి పాలయ్యాడు. కూతురు పుట్టిన పదేళ్ల తర్వాత బాబు జన్మిస్తే తల్లిదండ్రులు సంతోషించారు. ఆ ఆనందం ఎంత సేపు నిలువలేదు. ఏడునెలల ఇషాన్ నిమోనియా బారినపడ్డాడు. ఆస్పత్రుల్లో 18 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం రూ.10 లక్షల ఖర్చవుతుడడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. జన్నారం మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కలీం, సోని దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు. కూతురు పుట్టిన పదేళ్లకు పుట్టిన బాబుకు ఇషాన్ పేరుపెట్టారు. పుట్టిన ఏడు నెలలకే అనారోగ్యం బారినపడ్డాడు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో చూపించగా నిమోనియా ఉందని, పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. రోజు కూలీ చేసి కుటుంబాన్ని పోషించుకునే తల్లిదండ్రులకు చికిత్సకు పెట్టే స్థోమత లేదు. ఎలాగైన కుమారుడిని బతికించుకునేందుకు హైదరాబాద్‌లోని రేయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. ఐదు రోజులకు రూ.4 లక్షల ఖర్చయింది. చికిత్స కోసం రోజు రూ.80 వేలు ఖర్చవుతుందని మరో 15 రోజులు ఉండాలని వైద్యులు చెబుతున్నారని దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు



ఇషాన్ (ఫైల్)

కూలీ పనిచేసుకునే తల్లిదండ్రులకు బాబు అనారోగ్యం రూపంలో పెద్ద ఆపద వచ్చింది. కొడుకును బతికించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జగిత్యాలలో పది రోజులు, కరీంనగర్ ఆసుపత్రిలో మూడు రోజుల అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. అప్పులు తెచ్చి రూ.4 లక్షలు ఖర్చు చేయగా, మరో రూ.10 లక్షల ఖర్చు అయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే కొడుకు బతికించుకుంటామని వేడుకుంటున్నారు. సాయం చేయదలిచినవారు గూగుల్ పే, ఫోన్ పే నంబర్ సెల్: 85559 80673 నంబర్‌కు నగదు పంపించాలి.


మ్యాట్రిమోని పేరుతో మోసం

- రూ.17 లక్షలు కాజేసిన దంపతులు
- బాధితుడి ఫిర్యాదుతో నిందితులను పట్టుకున్న రామగుండం సైబర్‌క్రైం పోలీసులు

మంచిర్యాలక్రైం: పెళ్లి సంబంధాల(మ్యాట్రిమోని) పేరుతో మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడిని మోసం చేసి రూ.17 లక్షలు కాజేసిన దంపతులను రామగుండం కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, అదే జిల్లా ముత్తారం మండలం ఏలూరుకు చెందిన సౌజన్య దంపతులు. వీరు ఈజీ మనీ కోసం సోషల్ మీడియాలో మ్యాట్రిమోని పేరుతో ఖాతా తెరిచారు. అందులో అందమైన అమ్మాయిల ఫొటోలు పెడుతూ.. వరుడు కావాలని ప్రకటనలు ఇచ్చేవారు. ఈమేరకు పెళ్లి కాని యువకులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపేవారు. ఇలా మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపారు. అతను దానిని ఆమోదించి వివరాలు తెలుసుకునేందుకు వారు ఇచ్చిన ఫోన్ నంబర్‌లో మాట్లాడారు. ఓ అమ్మాయి తనకు నచ్చిందని, పెళ్లి చేసుకుంటానని తెలిపాడు. దీంతో సదరు దంపతులు ఓ యువతితో నేరుగా మాట్లాడించారు. తనకు కూడా నచ్చావని చెప్పించారు. ఇలా మాటల్లో పెట్టి సంబంధం కుదిరినట్లే అని బురిడీ కొట్టించారు. తర్వాత తన ఆరోగ్యం బాగా లేదని, తన కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగాలేదని వివిధ సందర్భాల్లో డబ్బులు వసూలు చేశారు. పెళ్లవుతుంది కదా అని సదరు యువకుడు కూడా రూ.17 లక్షల వరకు చెల్లించాడు. తర్వాత ఫోన్ చేసినా స్పందించలేదు. స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు రామగుండం సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులను ట్రాప్ చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యను అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఏసీపీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తిని సీపీ శ్రీనివాసులు అభినందించారు.

గుండెలదురుతున్నాయ్..

- ఆగుతున్న ఊపిరి!
- జిల్లాలో పెరుగుతున్న హృద్రోగ, కాలేయ సమస్యలు
- ఆకస్మిక మరణాల్లో మధ్యవయసుల వారే..
- ఆహారపు అలవాట్లే కారణమంటున్న వైద్య నిపుణులు



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో హృద్రోగ, కాలేయ సమస్యలు పెరిగిపోతున్నాయి. 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసులు వారే ఎక్కువగా మృతి చెందడం ఆందోళనలకు గురిచేస్తోంది. ఆహారపు అలవాట్లు మద్యపానం, సరైన వ్యాయామం లేకపోవడం, క్రిమిసంహారక మందులతో పండించిన కూరగాయలే అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

- జిల్లాకేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పదిరోజుల క్రితం ఉదయం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఛాతీలో నొప్పి అంటూ సోఫాలో పడిపోయాడు. నిమిషాల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయాడు.
- నర్సాపూర్(జి) మండలంలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన యువకుడు (36) తన కుటుంబంతో వృత్తిరీత్యా నిర్మల్‌లో నివాసముంటున్నాడు. అతను ఆకస్మాత్తుగా గత శనివారం రాత్రి ఇంట్లో కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం చెందాడని వైద్యుడు తెలిపారు.
- రెండునెలల క్రితం జిల్లాలోని ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నెలరోజుల సెలవుపై విదేశాల నుంచి వచ్చాడు. ఇంట్లో గృహప్రవేశం జరిగిన మూడో రోజే గుండెపోటుతో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
- కొన్నినెలలక్రితం నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్‌కు చెందిన యువకుడు(39) ఉదయం ఛాతిలో నొప్పి అంటూ ఇంట్లో పడిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది.
- జిల్లాకేంద్రానికి చెందిన వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చెకప్ కోసం ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్ష చేయిస్తే కాలేయం 80 శాతం మేర చెడిపోయిందని తేలింది.

ఎన్నో కారణాలు..

ప్రధానంగా గుండె లయ తప్పడానికి ఎన్నో అంశాలు ప్రభావం చూపుతాయి. కొందరిలో గుండె కండరం మందం కావడం, పుట్టుకతో గుండెలో లోపాలు, కర్ణికలు పెద్దగా ఉండడం, జన్యుపరంగా తలెత్తే ఇతర సమస్యలే ఇందుకు కారణమవుతున్నాయి. కండరం మధ్య భాగంలోని కణాలు అతి చురుకుగా స్పందించడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. శరీరానికి రక్తప్రసరణ సరిగా జరగక పోవడంతో తల తిరగడం, స్పృహ కోల్పోవడం, నిమిషాల వ్యవధిలో మరణాలు సంభవిస్తున్నాయి. యువత వ్యాయామం, డ్యాన్స్ చేస్తున్నప్పుడో కుప్పకూలుతున్న ఘటనలు తరచూ సంభవిస్తున్నాయి.

వైద్యులను సంప్రదించాలి



గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఆహార నియమాలు పాటించాలి. ప్రతి ఒక్కరికి ఉదయం నడక, వ్యాయామం, యోగా సాధన చేయాలి. ఏదైన అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలి. శీతాకాలంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.ఎస్.ఆదిత్య, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రాథోడ్ శంకర్ మృతదేహం

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. మండలంలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీకి చెందిన నిఖిల్, పారిగాం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌లు ఆదివారం కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వైపు బైక్‌పై వస్తున్నారు. హుడ్కిలిలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ శంకర్(50) కాగజ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. వేంపల్లి సమీపంలో నిఖిల్ రాంగ్ రూట్‌లో వచ్చి ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాథోడ్ శంకర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా నిఖిల్, శ్రీకాంత్‌లకు గాయాలయ్యాయి. మృతుడి భార్య రాథోడ్ కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన ఆకు లక్ష్మణ్ తన కుమారుడితో కలిసి ఆదివారం బైక్‌పై కనకపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కనకాపూర్‌కు చెందిన కరిపె రమణయ్య రోడ్డు పక్కనే ఉన్న తన పొలం నుంచి బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆకు లక్ష్మణ్ కాలు విరగగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. కరిపె రమణయ్య తల తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ఆర్.నాందేవ్(38) గతనెల 31న మృతిచెందాడు. కుటుంబీకులు అనుమానంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన మృతదేహాన్ని తహసీల్దార్ సమక్షంలో ఆదివారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..నాందేవ్ మహారాష్ట్రలోని లక్ష్మీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో కూలీగా పనిచేసేవాడు. గతనెల 30న అక్కడి నుంచి ఇంటికి తిరిగిరాగా, మరుసటి రోజు ఇంట్లో మృతిచెందాడు. కుటుంబీకులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. జిన్నింగ్ మిల్లులో మిథున్‌తో గొడవ జరిగిందని సమాచారం రావడంతో ఫిర్యాదు చేశారు. ఆయన మృతికి కారణమై ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేయడంతో పోస్టుమార్టం నిర్వహించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.



తాండూర్ జెడ్పీ పాఠశాల పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

అ'పూర్వ' సమ్మేళనం

తాండూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో జరిగిన అపూర్వ సమ్మేళన కార్యక్రమానికి ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

- విష్ణు శివానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004--05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సురభి గోదా క్షేత్రగార్డెన్స్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చెరువులో దూకి ఒకరు, పురుగుల మందు తాగి ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

చెరువులో దూకి యువకుడు..



గంగాధర్ (ఫైల్)

కుంటాల: మతిస్థిమితం లేని యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన చందులవార్ గంగాధర్ (33), భార్య సరిత భార్యభర్తలు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గంగాధర్ మద్యానికి బానిసయ్యాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేవాడు. దీపావళి పండుగ కోసం భార్య సరిత గత బుధవారం అర్లి(కె) గ్రామంలో తల్లిగారింటికి వెళ్లింది. గంగాధర్ శుక్రవారం రాత్రి బయటికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆదివారం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య సరిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో మహిళ

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం..మండలంలోని కుచులాపూర్ పంచాయతీ పరిధిలోని మత్రిపల్లె గ్రామానికి చెందిన కొడప లక్ష్మీబాయి (38) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసైంది. ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. భర్త లక్ష్మన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువుకు దూరమయ్యానని యువతి..



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సాయికుమార్



సీమల జయశ్రీ (ఫైల్)

పెంబి: చదువుకు దూరమయ్యాయని మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయి కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన సీమల సోమవ్వ–లింగన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. చిన్న కూతురు జయశ్రీ(17) రెండేళ్ల క్రితం ఇంటర్ పరీక్షల సమయంలో అపెండిక్స్ సర్జరీ కావడంతో పరీక్షలు రాయలేదు. దీంతో ఇంటి వద్ద ఉంటూ తల్లిదండ్రులతో వ్యవసాయ పనులకు వెళ్లేది. గత కొంతకాలంగా చదువుకు దూరమయ్యానని తల్లిదండ్రులకు చెబుతూ బాధపడేది. ఎప్పటిలాగా జయశ్రీ శనివారం తల్లి సోమవ్వతో కలిసి పత్తి చేనుకు వెళ్లి ఇంటికి వచ్చింది. పురుగుమందు వెంట తీసుకుని మరో చేను వద్ద తాగింది. గమనించిన జయశ్రీ చిన్నాన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. తండ్రి లింగన్న ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడు..



భరత్(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అంగడిబజార్‌కు చెందిన కోయల్కర్ భరత్(28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. భరత్ బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం పలుమార్లు సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యేవాడు. ఎలాంటి ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తితో శనివారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి బాబాయ్ మధు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న ఆటో, కలపతో అటవీ సిబ్బంది

కడెం: మండలంలోని నవబ్‌పేట్ సమీపంలో అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను అటవీ సిబ్బంది ఆదివారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో గీతారాణి తెలిపారు. పక్కా సమాచారంతో లక్ష్మీపూర్ ఎఫ్‌బీవో నుమానుద్దీన్ బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి ఆటోను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారన్నారు. పట్టుబడిన కలప దుంగల విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని తెలిపారు.

ఇంట్లో చోరీ

ముథోల్: మండల కేంద్రంలోని కోటగల్లీలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. బాసర మండల కేంద్రానికి ఫర్జాన..కొన్నిరోజులుగా ముథోల్‌లోని కోటగల్లీలో అద్దె ఇంట్లో ఉంటోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నిజామాబాద్ వెళ్లింది. రాత్రి 10 గంటలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.80 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలను దొంగలు ఎతుకెళ్లారని బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన సంజీవ్ (33) గతవారం క్రితం అదృశ్యమైనట్లు కుటుంబీకులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ వ్యక్తి ఆదివారం జైనథ్ మండలంలోని పెండల్‌వాడలో శవమై కనిపించాడు. వాగు సమీపంలో మృతిచెంది ఉండగా, స్థానికులు గమనించి జైనథ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.